# శైలూషి

మనోరమను మొట్టమొదటి సారిగా యేదో నాటకంలో చూశాను. నిజానికి ఆవాళనుంచీ నాకు జీవితంలో శాంతిలేకుండా పోయింది. మా ఇంట్లో బయట గదిలో కూర్చుని రాత్రుళ్లు లైటు తీసివేసి కిటికీలోంచి బయట ప్రపంచంలోకి చూస్తున్న సమయాల్లో నాకు చటుక్కున మనోరమ గుర్తుకు వచ్చేది. ఆ రాత్రుళ్ళు నల్లనైన తారు పూసుకున్నటువంటి వైనా కాని, బాగా పండిన మొగలి పువ్వులవంటి కాంతి విరజిమ్ముతున్నవైనాకాని మనోరమ గుర్తు వచ్చేది. వెన్నెలైనా, చీకటైనా, గుర్తు వచ్చేది. నా కెందుకో కన్నీళ్ళు రాని దుఃఖం వచ్చేది. ఈ దుఃఖాన్ని నే నెవరికు చెప్పుకోను? ఎలా వదుల్చుకోను? అనుకునేవాణ్ణి అప్పుడు.

కాని, యీ దుఃఖం కూడా నాకు అలవాటైపోయింది. అలవాటైపోయిన తర్వాత నన్నేమీ చెయ్యలేక పోయింది.

ఎప్పుడో ఒకరోజున వీధిలో నడుస్తూ వుండగా వాన కురిసినప్పుడు ఆ కాసేపు తడవకుండా యెక్కడో నిలుచున్నప్పుడు, అనుకోకుండా చీకట్లో నడుస్తున్నప్పుడు కనపడని—నిండా పూచిన వేపచెట్టు చైత్రమాసం వచ్చిందని చెప్పినప్పుడు, ఆ సంవత్సరానికి మొట్టమొదటసారిగా మల్లెపూలు చూసినప్పుడు, అందమైన ఆడపిల్ల నా కళ్ళకు అందంగా లేని మగవాడిపక్క నడుస్తున్నప్పుడు, గుండెల్ని కోసేసే పాట వినపడ్డప్పుడు, మంచు కురుస్తున్న రాత్రులందు, అర్ధరాత్రి వేళ నిద్రరాక బాధ పడుతున్న సమయంలో, దూరంగా రైలుకూత వినిపించినప్పుడు, ఒక్క ఓదార్పు వాక్యం యెక్కడైనా

వినపడి నప్పుడు, ఎవరైనా అడవాళ్లు నాతో అభిమానంగా మాట్లాడి నప్పుడు, వీధిలో శవం కనిపించి నప్పుడు, శ్రావణ మాసంలో యేవనం వస్తున్న బంగారు తల్లి యెవరేనా చామంతిపూల పెద్ద జడ వేసుకుని నాకు కనపడినప్పుడు, పసుపు రాసుకున్న పాదాలతో మధ్య వయస్కులైన ఆడవాళ్లు పేరంటానికి వెళ్ళి తిరిగి వస్తూ కని పించినప్పుడు, నీతిలేని వాళ్ళను తలుచుకున్నప్పుడు, నీతిని గురించి ప్రశ్నించుకున్నప్పుడు, ఏదైనా సినిమాలోని అందమైన నాయిక ఎన్నడో కలలో కన్పించిన మర్నాటి ఉదయం కాఫీ తాగేప్పుడు— మనోరమ గుర్తువచ్చేది.

మనోరమ యెందు కింతగా గుర్తు వస్తుందో నాకు తెలియదు. నేను తెలుసుకుందామని ప్రయత్నం కూడా చెయ్యలేక పోయాను. మనోరమ నాకు కావాలి, నాకు రెండుపూట్ల కాఫీ, రెండుసార్లు భోజనం యెంత అవసరమో మనోరమ కూడా అంతే అవసరం అనిపించిన రోజులున్నై. నేను రెండుపూట్ల కాఫీ, భోజనం మానే సిన రోజులూ వున్నై, మనోరమ యెందుకు పుట్టింది? నేను చచ్చిపోనేం? అనుకున్న రోజులూ వున్నై.

మనోరమను ఆ నాటకంలో చూసిన రోజున, నా కెందుకో చెప్పలేని దుఃఖం వచ్చింది. ఈ ప్రపంచంలో ఇంత సౌందర్యం వుంది. ఇంత సుఖం వుంది, తృప్తి యెందుకు ఉండదు. తృప్తిని కూడా సాధిస్తాను, అనుకున్నాను. మనోరమ చాలా అందమైంది అని చెప్పి, ఆమె అందానికినేను అన్యాయం చెయ్య లేను. అదేదో ఒక సీనులో ఆమె తెల్లని బట్టలతో కనిపించింది చీర తెల్లనిది. చోళీ తెల్లనిది. తల్లో పెట్టుకున్న పూలు తెల్లనివి. ఒక పెద్ద నందివర్ధనపు పువ్వులా అనిపించింది అవాళ. ఇవాళ

ఉమ్మెత్త పువ్వు అనిపిస్తున్నది కేవలం కసికొద్దీ ఆమె ఉమ్మెత్త పువ్వు అనిపిస్తున్నది కాని, నిజానికి ఉమ్మెత్త పువ్వులాటిది అనాలని నాకు లేదు.

మర్రోజు ప్రొద్దున్నే సిగ్గూ, అభిమానమూ విడిచి మనోరమ వాళ్లు యెక్కడ వుండేదీ కనుక్కోగలిగాను.

అప్పటికి నాకు యీ జీవితాన్ని గురించి యేమీ అనుభవం లేదు. వాళ్ళు ఆ ఊళ్ళో చాలా గొప్ప ఖరీదైన హోటల్లో బస చేశారు. ఆ హోటల్ చాలా పెద్దది. నేను వెళ్లి ఒకపక్క కూచుని కాఫీతాగుతూ వున్నప్పుడు నా కాళ్ళెందుకో వణికినై.

వాళ్ళు బసచేసిన గది వద్దకు వెళ్లాను. అక్క డెవరో నన్ను నిలవేసి 'యేం కావాల'న్నారు, ఏం చెప్పగలను? మళ్ళీ వెనక్కు తిరిగి వెళ్ళిపోయాను. ఎక్కడకు వెళుతున్నానో తెలీకుండా వెళుతున్నాను, నోరు చేదెక్కిపోయి సిగరెట్లు కాల్చటం మానేశాను. ద్వేషం పుట్టి కాఫీ తాగటం లేదు, సాయంకాలం నాటకాల హోలు దగ్గరకు వెళ్లాను. అక్కడ యెవరి నని అడిగేది? అవాళ మనోరమ నాటకంలో వేషం వెయ్యటం లేదు. నాటకాల కంపెనీ మానేజరుని అడిగాను—నేను మనోరమతో కాసేపు మాట్లాడాలి. ఆమెను అభినందించాలి అని. వాడు నన్ను కోపంగా చూశాడు. వాణ్ణీ విడిచిపెట్టి ఇవతలకు వచ్చేశాను. ఆర్గనైజర్ ఒకడు వున్నాడు. వాడు ఫస్టు క్లాసు గేటుదగ్గర టిక్కెట్లు తీసుకుంటుంటాడు, వాణ్ణి అడిగాను.

"వంద రూపాయ లిస్తే ఆమె దగ్గరకు నేను తీసుకపోతాను." అన్నాడు. అ మాట నలా అనలేదు. ఆమె ఖరీదు వంద రూపాయ

అన్నాడు—వెధవ! ఆ మాటలు విన్నతరువాత నాకు యేడుపొచ్చింది. ఆమె ఖరీదు ఒక్క వంద రూపాయలా? వెధవ! లక్ష రూపాయ లిస్తాను. ఆమె నాకు కావాలి. అవాళ రాత్రి వాడి మాటలు నాకన్ను అప్పు డప్పుడు చెమ్మగిలేట్లు చేసినయ్. అవాళ రాత్రి నా కేమీ తోచలేదు.

“ఆమే, నేనూ కలిసి ఓసారి రైల్లో ప్రయాణం చేస్తున్నాము. ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో ఆమె వేపు తృప్తిగా చూస్తూ కూచున్నాను. ఎక్కడో స్టేషన్‌లో రైలు ఆగినప్పుడు, ఎవరో మనుషులు కంపార్టుమెంటు లోకి తొంగి చూశారు. చూసి ఇలా అన్నారు. నాకు వినపడితే నేను యేడుస్తానన్న జ్ఞానైనా వాళ్ళకు లేదు. “ఇదుగోరో యీ మనోరమ ఇక్కడుంది, ఫలాని—”

ఇంకోసారి మే మిద్దరమూ పార్కులో కూచున్నాము.

ఎవరో వచ్చి మనోరమ పక్కనే కూచుని “ మీరు నాటకాల్లో వేషం వెయ్యకపోవటం యేమీ బాగులేదు. మన నాటక కళకి, ఇందుమూలంగా పూరించలేని నష్టం వచ్చి పడింది; మీరు మళ్ళీ నాటకాల్లో వేషం వెయ్యాలి” అన్నాడు. నా దగ్గర తుపాకి ఉంటే వాణ్ణి కాల్చి చంపుదును.

ఇంకో సారి సాయంకాలంపూట మల్లెపూలు పట్టుకుని సంతోషంగా నడచి వచ్చాను. మా ఇంట్లో బయట గది వాకిలి దగ్గరగా వేసి వుంది.

మనోరమతో యెవరో మాట్లాడుతున్నారు.

వాడు నాటకాల కంపెనీ మానేజరు.

మల్లెపూలు కిందపోసి వాటి మీదుగా నడిచాను. గోడ పక్కకు ముఖం తిప్పి ఇంకోరికి వినపడకుండా యేడ్చాను.

"నేను నాటకాల్లో వేషం వెయ్యాలి. నేను వెళ్ళిపోతాను"

అన్నది మనోరమ.

నేను యేడ్చాను. ఆమె వెళ్ళలేదు.

మగవాళ్ళెవ్వరూ వుండని ప్రదేశం యెక్కడేనా వుంటేనా— నాటకాలు వెయ్యని దేశం—అక్కడకు మే మిద్దరమూ వెళ్ళి పోతాం. ఆమె చెప్పినట్లు చేస్తాను. ఆమె కూచోమంటే కూచుంటాను. లేవమంటే లేస్తాను.

అయినా ఆమె నా దగ్గర వుండదట.

ఎక్కడకో వెళ్ళి పోతుందట.

నీ కేం కావాలి?

నాకు తెలీదు.

నా కేం కావాలి.

నువ్వు...

అవాళ రాత్రి తెల్లవారింది. ఇలాంటి ఆలోచనలతో కలలతో, ప్రొద్దున్నే మళ్లీ వాళ్ళు బస చేసిన హోటల్ దగ్గరకు వెళ్లాను.

నిన్న లాగానే మళ్ళీఅడిగారు. "ఎవరు కావాలి?"

"మనోరమ గారు"

అనుకోకుండా చక్కని అబద్ధం చెప్పగలిగాను.

''మా ఊళ్లో నాటకం వేస్తాము. అందులో ఆమె వేషం వెయ్యాలి."

"అలా అయితే కూచోండి.''

నేను కూచున్నాను.

ఆమె వచ్చింది—నా మనసులా.

నమస్కారం చేసింది.

''నాటకంలేదు. ఏమీ లేదు. మిమ్మలి చూసి మీతో మాటాడుదామనీ..." ఆ మాటలు త్వరత్వరగా చెప్పాను. గాలి పీల్చుకోనైనా లేదు.

ఆమె నవ్వింది. ఆ నవ్వు నాకు కావాలి. ఇంకేమీ వద్దు. ఇంకేదీ వద్దు. ఆమెకు కోపం వచ్చింది. అలాంటప్పుడు ఆమెను నేను ప్రాధేయపడాలి.

"మీకుడబ్బుకావాలా?" అడిగేను.

ఆమె నావేపు ఆశగా, అనుమానంగా, ఇష్టంగా, కష్టంగా, ఆదరంగా, నమ్మలేనట్లు, అసహ్యంగా చూసింది.

"మీరు నాటకాల్లో వేషం వెయ్యవద్దు." అన్నాను.

"మీకు పిచ్చా...?''

"రెండు మూడు రోజులనినుంచీ'' అని చెప్పాను.

ఆమె నవ్వింది. "ఇక వెళ్ళిపోండి" అన్నది.

డబ్బు చూపించాను. అమె అప్పుడు నన్ను ఆదరంగా చూడటం నా మనసుకెంతో కష్టమనిపించింది.

"ఈ డబ్బు తీసుకోండి. మిమ్మల్నొకసారి కౌగలించుకుంటాను."

ఆమె నివ్వెరపోయింది. బహుశా యేనాటకంలోనూ, ఏ ఆశ్చర్యం పొందవలసిన ఘట్టాన్నో నటించవలసినప్పుడు అంత ఆశ్చర్యం చూపివుండదు.

అవాళనుంచీ అక్కడ మనోరమ్మ వున్న పదిరోజులూ నేను రోజూ రెండుసార్లు వాళ్ళ బసకు వెళ్ళేవాణ్ణి. పదవరోజున కాబోలు—

"నువు నాటకాల్లో ఇక వేషం వెయ్యవద్దు," అన్నాను.

"ఏమిటీ అధికారం?" అంది

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

"వద్దు."

"నేను బ్రతకలేను."

"లేకపోతే?"

"నువు కావాలి."

మనోరమ నవ్వింది— శీతాకాలపు యెండలా.

"నాతో స్నేహంగా వుండు. నాకేసి చూస్తూ యెప్పుడూ నవ్వు. ఇతరులతో స్నేహంగా వుండవద్దు. ఇతరులకేసి చూసి నవ్వవద్దు."

మనోరమ ముఖం చిట్లించింది.

"నువు చాలా అందంగా వుంటావు. నీకేం కావాలి? అది నేనిస్తాను. నాతోరా. మనుషులు లేనిచోట— యెటుచూసినా

మబ్బులు కనిపించేచోట, రకరకాల పువ్వులు మన తోటలో పూస్తవి. మన ఇంటి కల్లంతదూరంలో ఏ ఋతువులోనూ యెండిపోని చిన్న కాలువ పారు తూంటుంది. ఒక చిన్న ఇల్లు కట్టు కుందాం. బయట వసారాలో కుర్చీ వేసుకుని కూచుని, నువ్వు ఆ కాలవలోంచి నీళ్ళ కడవ బుజాన పెట్టుకుని వస్తూవుంటే నేను చూస్తూంటాను. నీతో నేను కాలవకి వచ్చి, నువు కడవ ముంచుతుంటే నీళ్ల గలగలను నేను వింటాను. పువ్వులన్నీ నీకోసం కోసి, రంగు రంగులు యేరి మాలలు రచిస్తాను. నీ వెనకాల నిలుచుని అవి నీ జడలో తురుముతాను. ప్రతిరోజూ నీకు కళ్యాణ తిలకం పెడతాను నా కనుపాపలో నీబొట్టు సరిచూసుకో. నీ కాళ్ళకు పారాణిపూసి నా ముఖాన్ని అక్కడ అద్దుకుని అద్దంలో చూసుకుంటాను.

"నీ వెనుకటి జీవితంతో నాకు పని లేదు.

"నాకు వేరే యేమీ వద్దు. నాతోవుండు.మనుష్యులు లేనిచోట మనిద్దరమూ వుందాము. రాత్రిళ్ళు అంతులేని ఆకాశం కింద మనిద్ద రమే మనుషులం. కోట్ల కోట్ల నక్షత్రాలు మనని చూస్తూ వుంటవి. వెన్నెల రాత్రుళ్ళలో వెన్నెల మన ఇంటి వసారాలో పరుచు కుం టుంది. నీ జడను నామెడ చుట్టూ చుట్టుకు కూచుంటాను. నీవొళ్ళో పడుకుని యెప్పుడో చచ్చి పోవాలని నా కోరిక. తరువాత నువు వెళ్ళిపో నామీద మల్లె పూలుపోసి."

మనోరమ అన్నది: "నీకు పిచ్చి. నీతో నేను బతకలేను. నాకు మనుషులు కావాలి. మనుషులతో తిరగాలి. నాటకాలు కావాలి. నాటకాల్లో వేషాలు వెయ్యాను— నీ కిష్టం లేకపోతే."

" అదేచాలు. పెళ్లాడు."

"పెళ్లి చేసుకోను."

"ఏం చేతనమ్మా— నా చిట్టివికదూ...?"

"నా బాబూ! అంతేను" మనోరమ గలగలా నవ్వింది.

మనోరమతో జీవించటం ప్రారంభించాను.

జీవించడం అంటే యేమిటో తెలిసి వచ్చింది, ఇన్నాళ్ళకు. ఆ తెల్లని బట్టల్తో, తెల్లటి పక్కమీద, తెల్లటిపూలు తలలో పెట్టుకొని నిద్రపోతుంటే మనోరమను చూస్తూ గంటలు గంటలు గడిపాను.

అవాళ నాటకంలో అంతచక్కగా నటించిన మనోరమేనా యీ మనోరమ? అవాళ నన్ను నిజంగా యేడ్పించింది. అవాళ ఆ నాటకంలో ఆ నాయకుడితో మాట్లాడినట్లు నాతో మాట్లాడదేం? ఆ కళ్ళలో అవాళ అంతప్రేమ కురిపించిందేం? ఎప్పుడూ అంత ప్రేమ చూడలేక పోయాను. గంటలు గంటలు ఆ కళ్ళలోకి చూశానుకాని, ఇంకా విసుగే చూశాను— కోపమూను.

అవాళ యెంత బావుంది. ఆ వేషం వేసిన హీరోని సంబోధించినట్లు నన్ను సంబోధించదేం?

చిత్రం. మనోరమ నటి!

అందులోనూ చాలా గొప్పనటి!

ఆమె ఏదేనా నాటకంలో వేషం వేసినప్పుడు నరవసాలూ వొప్పించ గలదు. అమె వేషం వేసినప్పుడు, ఆర్ద్రమైన హృదయం కలవాడెవ్వడైనా— జీవితంలో ఆమె లభించటంకంటే కోరుకో దగ్గ సుఖం యేదీ వుండదనే అనుకుంటాడు. ఆమెకళ్లు చూస్తూ యీ జీవితాన్ని గడిపి వేయవచ్చు ననుకుంటాడు.

మనోరమ పట్టుమని నాతో సంవత్సరమైనా వుండలేక పోయింది.

నా మంచితనం, పరువు, డబ్బూ, మర్యాదా అన్నీ ఆమె కోసం వదిలి వేశాను. లక్ష్యపెట్టలేదు.

నాటకంలోలాగా, 'అని నిష్క్ర మించును' అంటారే—అలాగే మనోరమ ఒకనాడు నిష్క్రమించింది, నాకు దుఃఖాన్ని వదిలిపెట్టి.

మనోరమ అలా నిష్క్రమిస్తుంది— అని నేను యేనాడూ అనుకోలేదు.

కాని, ఆమె నిష్క్రమించింది.

నేను అనుకున్నవన్నీ, ఊహాలో రచించుకున్నవన్నీ కవిత్వానికి పనికివచ్చే వస్తువులుగానే వుండి పోయాయి. ఒక్కటీ నిజం కాలేదు.

ఈ ప్రపంచంలో నేను ఏకాకిని. వేదాంతమంటూ నవ్వకుండావుంటే ఒకటి చెపుతాను. ఈ ప్రపంచంలోకి ఏకాకిగానే వచ్చాను. ఏకాకిగానే వెళ్లిపోతాను. బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు దిగవలసినచోట దిగిపోతాము. బస్సు నిండుగానే వుంటుంది. ఇదీ జీవితం!

ఇవాళ, ఇన్నాళ్ళ తరువాత, ఇప్పుడేకాదు, ఎప్పుడైనా—యెన్ని రోజుల తరువాతనైనా సరే, మనోరమ గుర్తువస్తే ఏమిటో అయిపోతాననే నాకు తెలుసు. ఇవాళ శూన్యంగా బయటిగది కిటికీలోంచి బయటి ప్రపంచాన్ని చూస్తుంటే, ఆ తెల్లని మబ్బుల్లోనూ, యెదురింటి గోడమీద సినిమా పోస్టర్‌లోనూ, పక్కింటి వాళ్లపాప మట్టిలో ఆడు కుంటుంటేనూ, మనోరమ గుర్తువస్తుంది.

రాత్రుళ్ళు గడచిపోయిన రోజులను మననం చేసుకుంటూ, అందరూ, నిద్రపోయినా, ఆకాశంలోని నక్షత్రాలకేసి చూస్తూ, సిగరెట్లు కాల్చుకుంటూ, ఎక్కడినుంచో నవ్వులువింటూ, పక్కింటి వాళ్లు వెలిగించుకున్న సాంబ్రాణివత్తుల పొగను ద్వేషిస్తూ, అర్థం లేకుండా మొఱిగే కుక్కనువింటూ, ఎక్కడో రైలుకూత కూసి కదలిపోతుంటే, ఆశబ్దంనాకు తెలుస్తుంటే, మనోరమ వుందేమో! అనుకుంటూ గడుపుతాను. మనోరమ ఇప్పుడు యెక్కడ వుంటుంది? ఆమె కళ్లను యెవరు ముద్దిడు కుంటుంటారు? మసీదులోని పున్నాగ పూలవాసన ఇంత దూరం వస్తుంది కాబోలు రాత్రుళ్లు. రాములవారి ఆలయంలో పవళింపు సేవ ఇంకా కానట్లువుంది, భజన వినిపిస్తోంది. రాత్రుళ్ళు యెంత ప్రశాంతమైనవి! అంత దూరాన్నుంచి ఆ భజన అలా వినిపిస్తోంది. అప్పుడే తెల్లార వస్తున్నది కాబోలు. భజన బృందంవాళ్లు తయారైనారు. మనోరమ అలసిపోయి నిద్రపోతూ వుంటుంది.

ఇలా, ఒక రాత్రా, రెండు రాత్రులా—
లెక్క నాకేం తెలుసు? గడచి పోతున్నాయి.
తరువాత చాలా రోజులకు తెలిసింది.
మనోరమ పెళ్ళి చేసుకుంది, నాటకాల కంపెనీ మేనేజరుని,
ఏదో పత్రికలో, యెందుకో చూశాను.
ఏమీ ఆశ్చర్యపోలేదు.
మనోరమ నటి, చక్కగా నటించ గలదు—
జీవితంలో కూడా.